నిజాంపేట్ కార్పొరేషన్‌లో
నీటి కటకట

- అడుగంటిన భూగర్భజలాలు • వాటర్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న జనాలు
- ప్రతి రోజు 500 ట్యాంకర్ల బుకింగ్ • కేవలం 100లోపు ట్యాంకర్లే వస్తున్న వైనం
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు • మురికివాడ ప్రాంతాల్లోని ప్రజల పరిస్థితి వర్ణనాతీతం



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లో నీటి కటకట మొదలైంది. కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌లో సుమారు వందలాది అపార్ట్‌మెంట్‌లు, మురికి వాడ ప్రాంతాలు, కాలనీలతో కలిసి ఉన్న ఈ ప్రాంతంలో సుమారు మూడు లక్షల పైచిలుకు జానాభా ఉంది. ఏప్రిల్ మొదటి వారం నుంచే నీటి సమస్య తీవ్రమైంది. ఓవైపు హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సరఫరా చేసే నీరు సైతం ఐదారు రోజులకు ఒక సారి సరఫరా అవుతుండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మురికి వాడ ప్రాంతాలైన రాజీవ్ గృహకల్ప, సాయినగర్, అంబేడ్కర్‌నగర్, ఇందిరానగర్, రాజీవ్ గాంధీనగర్, ఇందిరమ్మ కాలనీలు, ఎన్టీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో సామాన్యులు అయితే నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

ట్యాకర్లపైనే ఆధారం....

ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు అడుగండిపోతున్నాయి. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు తప్పనిసరి పరిస్థితుల్లో ట్యాకర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ట్యాకర్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ట్యాంకర్ డ్రైవర్లు సైతం భౌరంపేట్, దుండిగల్, బొల్లారం గాగిల్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి నీటిని తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ట్యాంకర్ కోసం అపార్ట్‌మెంట్ వాసులు, గేటెడ్ కమ్యూనిటీ వాసులు పడిగాపులు కాస్తున్నారు.

బుక్ చేసిన వారానికి ట్యాంకర్...

క్యాన్ నెంబర్ ఉన్న వారు హెచ్ఎండబ్ల్యూఎస్ ట్యాంకర్ బుక్ చేసిన వారం రోజులకు రావడం విశేషం. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సుమారు ప్రతి రోజు 500 మంది వరకు ట్యాంకర్లు అన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నాట్లు తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం రోజుకు వందలోపు మాత్రమే ట్యాంకర్లు సరఫరా చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

15 రోజులకోసారి...



నీళ్లు లేక ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకర్ కోసం రోజు ఎదురు చూస్తున్నాం.15 రోజులకు ఒకసారి ట్యాంకర్ వస్తే మా అవసరాలు ఎలా తీరుతాయి. ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన మాకు నీటి కష్టం తీరడం లేదు. ఇప్పటికైన ప్రతి రోజు ట్యాంకర్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి..

– శివరాణి, సాయినగర్



నిజాంపేట్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో ట్యాంకర్‌లో నీటిని నింపుతూ..

మురికివాడల్లో ట్యాంకర్లు బంద్!

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొన్ని కాలనీల్లో ఎలాంటి నీటి కనెక్షన్లు లేవు. ఇవ్వడానికి పేదల ఇళ్లకు నోటారీ స్థలాలు కావడంతో అధికారులు నీటి కనెక్షన్లులు ఇవ్వడం లేదు. దీంతో కేవలం మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే ట్యాంకర్ డ్రైవర్లకు బిల్లులు సక్రమంగా చెల్లించకుంటే ట్యాంకర్ యాజమానులు వెంటనే ట్యాంకర్లను నిలిపివేస్తున్నారు. దీంతో పేద ప్రజలు నీటి కోసం పడుతున్న కష్టం వర్ణనాతీతం. కనీసం పేదలకు గుక్కెడు నీళ్లు సరఫరా చేయలేరా ?అని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ప్రజలు ప్రైవేటు ట్యాంకర్‌లను డబ్బులు చెల్లించి కొనుక్కునే పరిస్థితి లేదు. ఓ వైపు ప్రభుత్వం ఇంటింటికీ నీరు సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇది అమలు కాకపోవడం బాధాకరం. ఇప్పటికే అధికారులు స్పందించి వెంటనే ప్రజలకు నీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

నీటి కనెక్షన్ ఇవ్వండి...



మా కాలనీకి నీటి కనెక్షన్లు ఇస్తే కొంతైన నీటి తిప్పలు తప్పుతాయి. వచ్చే ఒక్క ట్యాంకర్‌తో నీటిని సరిపెట్టుకోవడం కష్టంగా ఉంది. దయచేసి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి కనెక్షన్లు ఇచ్చే ఏర్పాటు చేయాలి. అప్పటి వరకు ప్రతి రోజు కనీసం ఉదయం సాయంత్రం వేళ్లలో రెండు ట్యాంకులు సరఫరా చేస్తే బాగుంటుంది.

– సుగుణమ్మ, సాయినగర్

నేడు వైష్ణవి దుర్గా ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో శ్రీ వైష్ణవి దుర్గామాత

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని సీసాలబస్తీ వైష్ణవి దుర్గా ఆలయంలో సోమవారం నవగ్రహ, సూర్యనారాయణ, కాలభైరవ, పంచముఖ ఆంజనేయస్వామి, దక్షిణామూర్తి, సప్తమాత్రికలు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని శ్రీ జయగురు నవ దుర్గా సేవా సమితి తెలియజేసింది. ప్రత్యేక పూజలతో పాటు మహా నైవేద్య, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటాయని వారు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరింది.

కేసీఆర్ హయాంలో నిరాటంకంగా తాగునీటి సరఫరా

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు: రంగరాయప్రసాద్



క్రాంతి నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిజాంపేట్: తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్ అన్నారు. బాచుపల్లిలోని క్రాంతి నగర్‌లో ఆదివారం ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాయప్రసాద్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. నిరాటకంగా తాగునీరు సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా నాడు ఉండేదని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కాసాని సుధాకర్ ముదిరాజ్, పైడిమాధవి, సుజాత, బాలాజీ నాయక్, నాయకులు అర్పిత, మధు, సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ విజయానికి అందరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజుల రామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలన్నారు. ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి జన సమీకరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి : సునీత



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సునీతామహేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌ను గెలిపిస్తే దేశం అభివృద్ధి సాధిస్తుందని మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. కొంపల్లిలోని అపర్ణ పామ్ మెడోస్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే మూడు హామీలను అమలు చేసిందన్నారు. త్వరలో మిగతా వాటిని అమలు చేస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

జగద్గిరిగుట్ట: లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్టలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. మతోన్మాద బీజేపీ, అవినీతి బీఆర్ఎస్‌ను ఓడించడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, ప్రవీణ్, భరత్, యాదగిరి, హమీద్ తదితరలు పాల్గొన్నారు.

హరివర్ధన్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు ఆదివారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి విజయం కోసం చర్చించారు. అన్ని వర్గాలను కాంగ్రెస్‌కు ఓటు వేసే విధంగా ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని హరివర్ధన్ రెడ్డి సూచించారు. ఓటర్లందరినీ వ్యక్తిగతంగా కలిసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలను గోపాల్‌రెడ్డి, పాండు, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దూరవిద్య మంచి అవకాశం



హాల్ టికెట్లు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

జీడిమెట్ల: దూరవిద్య ద్వారా చదివిన విద్యార్థులు సైతం పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చునని వివేకానంద విద్యా మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పాఠశాలలోని దూరవిద్య స్కూల్‌లో 10వ తరగతికి కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేశారు. అనివార్య కారణాలతో.. ఆర్థిక ఇబ్బందులతో పాఠశాలకు దూరమైన విద్యార్థులకు దూరవిద్య కోర్సు చదువుకునేందుకు మంచి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఇంకా ఎవరైనా విద్యార్థుల దూరవిద్యా కోర్సు ద్వారా 10వ తరగతి పరీక్షలు రాయాలనుకుంటే వివేకానంద పాఠశాలలోని స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని కోరారు. విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేసిన వారిలో పాఠశాల కరస్పాండెంట్ సునీత వైస్ ప్రిన్సిపల్ లత నాలెడ్జ్‌హైస్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టు.. రోగాలకు చెక్ పెట్టు





ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

దుండిగల్: ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ వహించే విధంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎడ్జిమెంట్ ది గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ బొంగునూరి హన్మంత్‌రెడ్డి అన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో బీఎల్ఆర్ క్లినిక్, లైఫ్ స్పాన్ ఆస్పత్రి సౌజన్యంతో 2కే రన్ నిర్వహించారు. పాఠశాల నుంచి గండిమైసమ్మ చౌరస్తా వరకు నిర్వహించిన రన్‌లో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వర ప్రసాద్, మా టీవీఎస్ ఎండీ తిరుపతిగౌడ్, లైఫ్ స్పాన్ ఆస్పత్రి ప్రతినిధి డాక్టర్ సురేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ... నేటి సమాజంలో ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం లేదన్నారు. దీంతో రోగాల బారిన పడుతున్నారని అన్నారు. వారికి అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

దేవుడి కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నిజాంపేట్‌లో పూజాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: విఘ్నాలను తొలగించే దైవం వినాయకుడు అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఈశ్వర్ విల్లాస్‌లో ఓనర్స్ వేల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వినాయక స్వామి విగ్రహా ప్రతిష్ఠాపన చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్ పూజల అనంతరం మాట్లాడుతూ... ఏ శుభ కార్యం తలపెట్టినా మొట్ట మొదటగా కొలిచేది విఘ్నాలను తొలగించే వినాయకుడినేని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, బీఆర్ఎస్ ఎన్ఎంసీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మధుసూదన్, వెంకటేశ్వర్‌రావు, రవికాంత్, పూర్ణచందర్ రావు, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రారంభోత్సవం..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లిలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రారంభోత్సవం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కలియుగ శ్రీనివాసుడి దయ, కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్లు భరత్ నవనీత, మల్లేశ్, నాయకుడు శ్రీనివాస్, బాలరాజు యాదవ్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ నూతన కమిటీకి అభినందనలు...

సూరారం కాలనీ డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీ సీనియర్ సిటిజన్స్ భవనంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ అధ్యక్షుడు బాస్కర్ రాజు, ప్రధాన కార్యదర్శి సాయిబాబా, కోశాధికారి సాగర్ ,ఉపాధ్యక్షులు సూర్యనారాయణ,కెవి సుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మామిల్లయ్య, జాయింట్ సెక్రటరీ ఎస్ బసవ పున్నయ్య, సుజాత, కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే వివేకానంద్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారయణ,డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక...

సూరారం కాలనీ డివిజన్‌లో టీఎస్ఐఐసి కాలనీ మాజీ అధ్యక్షుడు నేతి రాజు ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చే రారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంతో హామిలను మించి అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారయణ, డివిజన్ అధ్యక్షుడు బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం..


సూరారం కాలనీ డివిజన్‌లో ఎమ్మెలే వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం మరింత వేగంగా అభివృద్ధి చెందాలంటే పార్లమెంటులో సైతం మన నాయకుడే ఉండాలన్నారు. అప్పుడే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రెంట్టింపు అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారయణ, నాయకులు భాస్కర్, సిద్ధిఖ్, చెక్క సురేష్, సాయిబాబా, రోషన్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల లబ్ధిదారులు కంగారు పడొద్దు

ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట: బాచుపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలు, ఇంటి తాళాలు ఇచ్చారని.. కాని వాటిలోకి వెళ్లడానికి మాత్రం అనుమతి లభించడం లేదని జగద్గిరిగుట్టకు చెందిన పలు కాలనీవాసులు వాపోయారు. ఈ విషయమై ఏ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ సంవత్సరం జూన్‌లో తమ పిల్లల స్కూళ్లు కూడా ప్రారంభమవుతాయని.. వారికి ఎక్కడ అడ్మిషన్ తీసుకోవాలో అర్థం కావడంలేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే వివేకనంద్‌ను కలిసి వారు తమ గోడును వినిపించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వివేకానంద్ సానుకూలంగా స్పందించి రెండు వారాలలో ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు వచ్చిన వారు కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు.

శరవేగంగా బతుకమ్మ కుంట పనులు



బతుకమ్మ కుంట నిర్మాణ ప్లాన్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో భూదేవిహిల్స్‌లో నిర్మిస్తున్న బతుకమ్మ కుంట పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.20 లక్షల రూపాయలతో అన్ని హంగులతో ఈ నిర్మాణం చేట్టనున్నట్లు గాజులరామారం ఏఈ తిరుపతి తెలిపారు. అర్థం 14 మీటర్లు, నిలువు 16 మీటర్ల స్థలం చుట్టూ ఎంఎస్ రేలింగ్ మరియు గేటును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే లోపల ప్లాట్ ఫాంతో పాటు 5 మీటర్ల చుట్టూ గుండ్రంగా నీరు నిలిచేందుకు రేన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్‌తో బతుకమ్మలు వేసేందుకు 0.75 లోతుతో నిర్మాణం జరగనున్నట్లు ఏఈ తిరుపతి అన్నారు. వీలైనంత తొందరగా ఈ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు. ఎప్పటి నుంచో కలగా ఉన్న ఈ బతుకమ్మ కుంట నిర్మాణ పనులు ప్రారంబమవడంతో స్థానిక ఆర్‌జీకే, కూనా మహాలక్ష్మీనగర్, భూదేవిహిల్స్ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి

లిబర్టీ: లోక్‌సభ ఎన్నికల్లో బీసీ వ్యతిరేక పార్టీలను గద్దెదించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి కోరారు. బీసీల పట్ల నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీసీలు నిద్రపోకూడదని విజ్ఞప్తి చేశారు. దళ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో ఒక్క బీసీ సమస్యను కూడా పరిష్కరించలేదని ఆరోపించారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వస్తే బీసీలను బిచ్చగాళ్లుగా మారుస్తుందని అన్నారు.

దుండిగల్ తండా-2లో చెలరేగిన మంటలు

రసాయనాలకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ తండా-2లోని డంపింగ్‌యార్డులో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రసాయనాలకు నిప్పుపెట్టారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఉవ్వెత్తున చెలరేగిన పొగతో సమీప ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి సమయంలో రసాయనాలకు నిప్పు పెట్టడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. డంపింగ్‌యార్డును ఇక్కడి నుంచి తరలించాలని కొంత కాలంగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించడం లేదన్నారు. డంపింగ్ యార్డులో ఇష్టానుసారంగా కెమికల్‌ను డంప్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డంపింగ్‌యార్డులో ఎగిసిపడుతున్న మంటలు

కుంటను రక్షిస్తారా?

లేక కబ్జాదారులకు అప్పగిస్తారా?

సుభాష్‌నగర్: మానవాళి మనుగడ సాగాలంటే తప్పనిసరిగా నీరు అవసరం. ఆ నీరే లేకుంటే పశుపక్షాదులే కాకుండా కనీసం భూమిపై గడ్డి మొలవడం కూడా కష్టతరం. అందుకే నీటి అవసరాల నిమిత్తం రేపటి తరానికి అందించడానికి, మన పూర్వీకులు వర్షం నీటిని ఒడిసిపట్టడానికి చెరువులు, కుంటలను తవ్వించారు. దీంతో ముత్తాతల నుండి చెరువు నీటి ద్వారా వ్యవసాయం, తాగునీరు ఇతర అవసరాలను తీర్చుకోగలిగారు. కానీ నేటి యాంత్రిక జీవనంలో కొంతమంది స్వాలాభం కోసం చెరువులు, కుంటల్ని మట్టితో నింపి సమాధి చేస్తున్నారనడానికి గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలో కబ్జాకు గురవుతున్న వడ్లవారి కుంటనే నిదర్శనంగా తీసుకోవచ్చు.

కుంట చరిత్ర..

మెట్‌కానిగూడ, సూరారం గ్రామాన్ని కలిపే రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 77లో నాలుగు ఎకరాల 28 గుంటల విస్తీర్ణంలో వడ్ల వారి కుంట ఉంది. ఈ కుంటను ఆనుకొని సర్వేనెంబర్ 70 శిఖం, సర్వే నెంబర్ 56 ప్రభుత్వ స్థలం, సర్వే నెంబర్ 77, 81, 78, ఎఫ్‌టీఎల్, సర్వే నెంబర్ 87, 70, 76, 56, 78, 81లలో బఫర్ జోన్లుగా కేటాయించారు.

గతంలో వ్యవసాయానికి..

గతంలో ఈకుంటలోని నీరును వ్యవసాయానికే కాకుండా ఇతర అవసరాల నిమిత్తం ఉపయోగించేవారు. కాలక్రమమైన నగరం విస్తరించడంతో చుట్టుప్రక్కల భవనాలు పుట్టుకొచ్చాయి. దీంతో కొంతమంది కళ్లు వడ్లవారి కుంటపై పడటంతో ఇప్పటివరకు 3 ఎకరాలకు పైగా స్థలాన్ని అప్పనంగా కాజేశారు. దీంతోపాటు కుంట చుట్టు ఉన్న బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాల్లో సైతం నిర్మాణాలు వెలిశాయి.



కుంటలో మట్టిని నింపి గదులు నిర్మించి స్క్రాప్ డంపింగ్ కేంద్రంగా మార్చిన దృశ్యం

కంచెను తొలగించి..

వడ్ల వారి కుంట ప్రస్తుతం ఒక ఎకరా విస్తీర్ణంలో ఉండగా, కబ్జాకు గురికాకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అయినప్పటికీ అధికారులు ఎన్నికల హడావిడిలో ఉండడంతో దొరికిందే చాన్స్ అంటూ కబ్జాదారులు కంచెను తొలగించి, 20 రోజుల వ్యవధిలో 6 నిర్మాణాలు చేపట్టారు. మిగతా స్థలంలో కూడా నిర్మాణాలను చేపట్టేందుకు ప్రస్తుతం మట్టి పోస్తూ రంగం సిద్ధం చేశారు.



సర్వే నెంబరు 77లోని వడ్డవారి కుంటలో తెరచాటున నిర్మాణాలు

అధికారులు విఫలం..

పట్టపగలే కుంటను పూడ్చి నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. దీంతో ఇప్పటికే కుంటలో పదుల సంఖ్యలను నిర్మాణాలు చేపట్టి లక్షలకు విక్రయించారు.

తూతూ మంత్రంగా కూల్చివేత..

ఈ విషయమై మార్చి 28న ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు అనే శీర్షికన 'సాక్షి'వెలుగులోకి తీసుకురాగ రెవెన్యూ సిబ్బంది తూతూ మంత్రంగా ఒక గదిని సగం వరకే కూల్చి చేతులు దులుపుకున్నారు. ఇక అధికారులు ఈ కుంటను రక్షిస్తారో లేదా కబ్జారాయుళ్ల చేతులో పెడతారో వేచి చూడాలి.